సాక్షి
హనుమకొండ

గురువారం । 23 । జనవరి । 2025



విద్యతోనే సమాజంలో గుర్తింపు
విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి అన్నారు.
- 8లో▸



మిలిటరీ వ్యూహాల్లో టెక్నాలజీ కీలకం
మిలిటరీ వ్యూహాల్లో కంప్యూటర్ టెక్నాలజీ కీలక భూమిక వహిస్తుందని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0°/16.0°

వాతావరణం
జిల్లాలో ఉదయం పొగమంచు ఎక్కువగా కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కుటుంబం కోసం హెల్మెట్ ధరించండి : సీపీ



వరంగల్ క్రైం: కుటుంబం కోసం ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి బుధవారం ప్రారంభించిన ర్యాలీలో సీపీ పాల్గొని మాట్లాడారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించడం అలవాటుగా మార్చుకోవాలని పేర్కొన్నారు. ద్విచక్రవాహన ప్రమాదాల్లో ఎక్కువమంది తలకు గాయాలై మరణిస్తున్నారని తెలిపారు. వాహనదారులు క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. జిల్లా రవాణాశాఖాధికారి పుప్పాల శ్రీనివాస్, అదనపు డీసీపీ సురేశ్‌కుమార్, ఏసీపీలు సత్యనారాయణ, నాగయ్య, ఆర్ఐలు స్పర్జన్‌రాజ్, సతీశ్, చంద్రశేఖర్, రోడ్డు రవాణా, పోలీసుశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మడికొండ: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మడికొండ బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం గురుకులంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మడికొండ బాలికలు, వర్ధన్నపేట (మడికొండ) బాలురు, పరకాల బాలురు, ఎల్కతుర్తి, పరకాల, హసన్‌పర్తి, వరంగల్ పశ్చిమ, ధర్మసాగర్, ఆత్మకూరు, భూపాలపల్లి గురుకులాల్లో ప్రవేశాలకు ఫిబ్రవరి ఒకటిలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గంజాయి దహనం



వరంగల్ క్రైం: తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆదేశాల మేరకు పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న గంజాయిని కాజీపేట మండలం అమ్మవారిపేట శివారు ప్రాంతంలో పోలీసులు బుధవారం దహనం చేశారు. 32 కేసుల్లో రూ.2.1 కోట్ల విలువైన 807 కిలోల గంజాయిని ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీ రవి ఆధ్వర్యంలో కాకతీయ మెడిక్లీన్ సర్వీస్ వద్ద దహనం చేశారు.

నేడు సర్వీస్ బుక్స్ పరిశీలన

విద్యారణ్యపురి: స్పౌజ్ టీచర్ల సర్వీస్ బుక్స్‌ను ఈనెల 23న హనుమకొండ డీఈఓ కార్యాలయంలో పరిశీలించనున్నట్లు డీఈఓ వాసంతి తెలిపారు. బదిలీపై వస్తున్న స్పౌజ్ టీచర్లు ఇరువురు కూడా తమ సర్వీస్ బుక్స్‌తోపాటు లేటెస్ట్ సర్వీస్ సర్టిఫికెట్లు, ఆయా జిల్లాల నుంచి రిలీవింగ్ ఉత్తర్వులతో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని ఆమె కోరారు.

ఎంజీఎంలో రసాయనాల కొరత

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో పారా మెడికల్ టెస్టులు చేయడానికి ఉపయోగించే రసాయనాలను ప్రభుత్వం సమకూర్చకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి రసాయనాల కొరత వేధిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో కిడ్నీ బాధితులకు సియా క్రియాటిన్ టెస్టులు చేయడం లేదు. దీంతో వేలాది రూపాయలు ఖర్చు పెట్టి ప్రైవేట్ ల్యాబ్‌ల్లో టెస్టులు చేయించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎంజీఎం ఆస్పత్రిలో రసాయనాలను అందుబాటులో ఉంచి, పారామెడికల్ టెస్టులు చేయాలని రోగులు కోరుతున్నారు.

బాలికల నిష్పత్తి పెంచాలి

హన్మకొండ అర్బన్: బాలికల నిష్పత్తి పెంచాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ఈనెల 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని రూపొందించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 22 నుంచి మార్చి 8 వరకు బాలికా సాధికారతపై అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సంక్షేమాధికారి జయంతి, డీఆర్‌డీఓ శ్రీను, బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి, డీఎంహెచ్ఓ అప్పయ్య, ఎస్సీ వెల్ఫేర్ డీడీ శ్రీలత, బాలరక్షా భవన్ కోఆర్డినేటర్ అవంతి, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ దొమ్మేటి కల్యాణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ప్రవీణ్‌కుమార్, సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి, భరోసా ఎస్సైలు శ్రావణి, విల్సన్ పాల్గొన్నారు.

కలగానే కాల్వ నీరు

- నక్కల తూము కెనాల్ పునర్నిర్మాణంలో జాప్యం
- ఆయకట్టుకు అందని ధర్మసాగర్ రిజర్వాయర్ నీరు
- పునరుద్ధరించాలని కోరుతున్న అన్నదాతలు

ధర్మసాగర్: మండల కేంద్రంలోని ధర్మసాగర్ రిజర్వాయర్‌పై రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన నక్కల తూము నుంచి వెళ్లే కాల్వను అధికారులు పునరుద్ధరించకపోవడంతో పంటలకు సాగు నీరందడం లేదు. 850 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు ద్వారా తూము ద్వారా సుమారు 12 కిలోమీటర్ల కాల్వ ఉంది. దీని ద్వారా ధర్మసాగర్, దేవునూరు, హసన్‌పర్తి మండలం మడిపల్లి, జయగిరి గ్రామాలకు చెందిన దాదాపు 2000 ఎకరాలకు సాగునీరు అందించేవారు. 1939లో అప్పటి ప్రభుత్వం వరంగల్ నగర ప్రజల దాహార్తి తీర్చడానికి చెరువు నుంచి పైపులైన్ ద్వారా తాగు నీటిని సరఫరా చేయడం ప్రారంభించింది. అప్పటి నుంచి నక్కల తూము కింద ఆయకట్టుకు నీటి సరఫరా నిలిపేశారు. 0.75 టీఎంసీల సామర్థ్యం గల ధర్మసాగర్ చెరువును రిజర్వాయర్‌గా మార్చడానికి 20 సంవత్సరాల క్రితం మరో 900 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించారు. 1.50 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించి ఇతర జిల్లాల్లోని అనేక గ్రామాలకు సాగు నీటిని అందిస్తున్నారు. అదేవిధంగా ధర్మసాగర్ రిజర్వాయర్‌కు సౌత్ కెనాల్, నార్త్ కెనాల్ నిర్మించి కూడా సాగు నీటిని సరఫరా చేస్తున్నారు. కానీ, నక్కల తూము ఆయకట్టుకు చుక్క నీరందడం లేదు. దీంతో స్థానిక రైతులు పలుమార్లు ఆందోళనలు చేయగా ఏడు సంవత్సరాల క్రితం సుమారు రూ.అరకోటి నిధులతో రిజర్వాయర్‌పై నక్కల తూమును పునరుద్ధరించారు. కానీ, ఇప్పటివరకు తూము నుంచి వెళ్లే



పునరుద్ధరణకు నోచుకోని కాల్వ

కాల్వ పనులు మాత్రం చేపట్టలేదు. రిజర్వాయర్ నుంచి ఇతర ప్రాంతాలకు నీటిని తరలిస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులకు కనిపించడం లేదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా నక్కల తూము కాల్వను పునరుద్ధరించి ఆయకట్టుకు నీరందించాలని అన్నదాతలు కోరుతున్నారు.



రిజర్వాయర్‌పై నిర్మించిన నక్కల తూము

కాల్వను పునరుద్ధరించాలి..



గతంలో ధర్మసాగర్ చెరువు నక్కల తూము నుంచి కాల్వ ద్వారా అనేక ఎకరాలకు నీరు పారేది. ఈ క్రమంలోనే వరంగల్ నగర ప్రజల దాహార్తి తీర్చడానికి చెరువు నీటిని తీసుకెళ్లడం ప్రారంభించారు. దీంతో నక్కల తూము కాల్వ ద్వారా ఆయకట్టుకు నీటి సరఫరా నిలిపివేశారు. 7 సంవత్సరాల క్రితం రైతుల కోరిక మేరకు రూ.లక్షలు వెచ్చించి తూము నిర్మాణం చేపట్టారు. అయితే కాల్వ పనులు చేపట్టడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి నక్కల తూము కాల్వను పునరుద్ధరించాలి.

– బొడ్డు ప్రతాప్, ధర్మసాగర్ రైతు

ఆయకట్టుకు నీరందించాలి..



ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే రైతులను మభ్యపెట్టడానికి ప్రజాప్రతినిధులు నక్కల తూము రాగాన్ని అందుకుంటారు. ఎన్నికలు ముగిసిన తర్వాత నిర్లక్ష్యం చేస్తున్నారు. నక్కల తూము కాల్వ పునరుద్ధరణ చేసి నీటిని విడుదల చేస్తే దాదాపు రెండు వేల ఎకరాలకు సాగు నీరందుతుంది. తూము నిర్మాణం చేసిన సమయంలోనే కాల్వ పునరుద్ధరణకు దేవాదుల ప్రాజెక్టు అధికారులు ఇరిగేషన్ శాఖకు నిధులు బదిలీ చేశారు. అయినా నేటి వరకు ఆ కాల్వ పునర్నిర్మాణం కాకపోవడం రైతులకు శాపంగా మారింది. అన్నదాతలు యాసంగి వరి నాట్లు మొదలుపెట్టారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించి నక్కల తూము కాల్వ పునర్నిర్మాణం చేపట్టి ఆయకట్టుకు సాగునీరందించాలి. లేకుంటే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది.

– గంకిడి వెంకట్‌రెడ్డి, రైతు

డిప్యుటేషన్లపై డైరెక్టర్ సీరియస్!

- పశుసంవర్ధకశాఖలో ఓడీలపై ఆరా
- ఈనెల 25 వరకు సమగ్ర నివేదికకు ఆదేశం
- డీఏవీహెచ్ఓలకు ఉత్తర్వులు జారీ

సాక్షిప్రతినిధి, వరంగల్:

సాక్షి ఎఫెక్ట్

పశుసంవర్ధకశాఖలో డిప్యుటేషన్ల వ్యవహారంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. పదోన్నతులకు ముందు, తర్వాత జరిగిన బదిలీలు.. ఆ వెంటనే కోరుకున్న చోటుకు ఆన్ డిప్యుటేషన్ (ఓడీ)లపై కొందరిని నియమించడం ఆ శాఖలో వివాదాస్పదమైంది. డిప్యుటేషన్ల కారణంగా వివక్షకు గురైన కొందరు పరస్పరం పేరు, ఊరు లేకుండా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు పొక్కింది. ఈ విషయమై ఈ నెల 13న 'వదలం.. కదలం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనం సంచలనంగా మారింది. ఈ మేరకు స్పందించిన పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన బదిలీలు, పదోన్నతులు, డిప్యుటేషన్లపై ఆరా తీసినట్లు తెలిసింది. డిప్యుటేషన్ల వ్యవహారంపై ఆయన సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ నెల 25 వరకు పూర్తి వివరాలు ఇవ్వాలని అన్ని జిల్లాల వెటర్నరీ, పశుసంవర్ధక అధికారులు, జాయింట్ డైరెక్టర్, ఇతర అధికారులకు డైరెక్టర్ బి.గోపి పేరిట సర్క్యులర్ జారీ అయ్యింది. 'డైరెక్టర్/సంబంధిత జిల్లా కలెక్టర్ల ముందస్తు అనుమతి లేకుండా డీవీఏహెచ్ఓలు సొంతగా సరైన ఆదేశాలు లేకుండా చేసింది ఏదైన ఉంటే రాష్ట్రంలోని జిల్లా వెటర్నరీ–పశుసంవర్ధక అధికారులు, ఇన్‌చార్జ్‌లు డిప్యుటేషన్ ఉద్యోగులపై వారి నిర్దిష్ట వ్యాఖ్యలతోపాటు వివరణాత్మక నివేదిక సమర్పించాలి. అటువంటి కేసులు ఏవీ లేనట్లయితే నిల్ నివేదిక పంపాలి. అటువంటి (డిప్యుటేషన్) కేసులు తర్వాత గుర్తిస్తే క్రమశిక్షణ చర్యకు బాధ్యత వహిస్తారు' అని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. మొత్తంగా వెటర్నరీ, పశుసంవర్ధక శాఖలో ఆన్ డిప్యుటేషన్ల వివాదం హాట్‌టాపిక్‌గా మారింది.



వదలం.. కదలం
బదిలీ.. పదోన్నతి.. నెలరోజులకే డిప్యుటేషన్

సాక్షి కథనం క్లిప్పింగ్

కొత్త నోటిఫికేషన్‌తోనే ఎంఎల్‌హెచ్‌పీల నియామకాలు

ఎంజీఎం: కొత్త నోటిఫికేషన్‌తోనే వైద్య, ఆరోగ్యశాఖలో 13 మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టులను భర్తీ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. 'వైద్య, ఆరోగ్యశాఖలో మళ్లీ నియామకాల లొల్లి' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు డీఎంహెచ్ఓతో కలెక్టర్ చర్చించారు. కాగా, నెల రోజుల్లో ముగియనున్న నోటిఫికేషన్ ద్వారా నియామకాల్లో బేరసారాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో కొత్త నోటిఫికేషన్‌తోనే నియామకాలు చేపట్టాలని జిల్లా ప్రజాప్రతినిధులు కలెక్టర్‌కు సూచించినట్లు సమాచారం. ఇందుకోసం అధికారులు తిరిగి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- కలెక్టర్ ప్రావీణ్య

పరకాల: పరకాల సబ్‌జైలు విస్తరణ, జడ్జి బంగ్లా నిర్మాణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పరకాల కోర్టును బుధవారం కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెండ్యాల భద్రయ్య, న్యాయవాదులు కోర్టు సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. తక్షణమే కోర్టు అభివృద్ధి పనులకు రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, తహసీల్దార్ భాస్కర్, కోర్టు సూపరింటెండెంట్ నవీన్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

నడికూడ: అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. రాయపర్తిలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు సంబంధించిన ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు ఉంటే గ్రామ పంచాయతీ కార్యదర్శికి లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. దరఖాస్తులను పరిశీలించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం అందించిన దరఖాస్తులను కూడా పరిశీలించనున్నట్లు చెప్పారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. అనంతరం నడికూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్, గ్రంథాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ నారాయణ, తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పరకాల కోర్టును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

గృహలక్ష్మి లబ్ధిదారులకు ఊరట

- ఇళ్ల నిర్మాణ పనులపై విచారణకు కోర్టు ఆదేశం
- జిల్లాలో అధికారులకు చేరిన కలెక్టర్ ఉత్తర్వులు

పరకాల: జిల్లాలో గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు ఊరట కలిగింది. ఇళ్ల నిర్మాణ పనులపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు వర్ధన్నపేట, పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల అధికారులకు కలెక్టర్ ఉత్తర్వులు చేరాయి. జిల్లాలో 5,972 ఇళ్లు గృహలక్ష్మి పథకం కింద మంజూరయ్యాయి. పరకాల నియోజకవర్గానికి 1,575, వర్ధన్నపేటకు 1,500, వరంగల్ పశ్చిమకు 2,121, హుస్నాబాద్ నియోజకవర్గానికి 776 ఇళ్లు కేటాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఇళ్లను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో 100 మంది లబ్ధిదారులు కోర్టును ఆశ్రయించారు. కలెక్టర్ స్వయంగా ప్రొసీడింగ్స్ అందించారని వారు కోర్టుకు విన్నవించారు. కోర్టు ఆదేశాలతో గృహలక్ష్మి పథకం ద్వారా మంజూరైన ఇళ్లు ఏ దశల్లో ఉన్నాయో విచారణ జరిపి ఫొటోలతో కూడిన నివేదిక అందజేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, పరకాల మున్సిపల్ కమిషనర్, హసన్‌పర్తి, ఐనవోలు, ఆత్మకూరు, దామెర, నడికూడ, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, వేలేరు ఎంపీడీఓలను కలెక్టర్ ఆదేశించారు. గృహలక్ష్మి లబ్ధిదారులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారా లేదా అనే విషయం కూడా స్పష్టం చేయాలని సూచించారు. అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకుని పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' కథనాలు ప్రచురించడంతో తమకు ఫలితం దక్కిందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు



గృహలక్ష్మి లబ్ధిదారుల కష్టాలపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

వైభవంగా మాషుఖ్ రబ్బానీ ఉర్సు



వరంగల్ ఉర్సు కరీంబాద్‌లోని హజ్రత్ సయ్యద్‌షా జలాలుద్దీన్ జామలుల్ బహార్ మాషుఖ్ ఏ రబ్బానీ(ర.అ) 469వ ఉర్సు బుధవారం రాత్రి ప్రారంభమైంది. రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే దర్గాను సందర్శించి గిలాఫ్, పూలు, సమర్పించారు.

– న్యూశాయంపేట

- వివరాలు 8లో▸

'బడిబయట' విద్యార్థుల గుర్తింపు

- సర్వేలో 39 మంది సీఆర్పీలు
- 25వరకు కొనసాగనున్న సర్వే
- ఇప్పటివరకు 30మంది విద్యార్థుల గుర్తింపు

విద్యారణ్యపురి : విద్యాహక్కు చట్టం ప్రకారం 6నుంచి 14 ఏళ్లలోపు చిన్నారులు తప్పనిసరిగా పాఠశాలల్లో చదువుకోవాలి. అయితే వివిధ కారణాలతో, చదువును మధ్యలోనే మానేసిన వారు, ఇతర ప్రాంతాల నుంచి పనుల కోసం వలస వచ్చిన బడీడు పిల్లలు కొందరు బడిబయటే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బడిబయట వారిని గుర్తించి, పాఠశాలల్లో చేర్పించి విద్యాభ్యాసం కొనసాగించేలా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సీఆర్పీల ద్వారా సర్వే నిర్వహిస్తున్నారు. హనుమకొండ జిల్లాలోని 14 మండలాల్లో బడిబయట పిల్లల గుర్తింపు ప్రక్రియ ఈ నెల 25వ తేదీవరకు కొనసాగనుంది. సీఆర్పీలు ఇంటింటికి తిరుగుతూ బడిబయట పిల్లలను గుర్తిస్తున్నారు. సంబంధిత పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులను సంప్రదించి దీర్ఘకాలంగా బడికి రాని విద్యార్థులను కూడా గుర్తిస్తున్నారు. ఆయా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తున్నారు. అలాగే 15 నుంచి 19 ఏళ్ల వయస్సు గల విద్యార్థులు ఎవరైనా విద్యను కొనసాగించకుండా ఉన్నట్లయితే వారిని సీఆర్పీలు గుర్తించి వివరాలు నమోదు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 39మంది సీఆర్పీలు 36 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని ఆవాసాల్లో ఈ సర్వే చేసి ఇప్పటి వరకు 30 మంది విద్యార్థులను గుర్తించారు.

గుర్తించిన పిల్లలకు ప్రవేశాలు

బడిబయట ఉన్న 6నుంచి 14 ఏళ్ల వయస్సు కలిగిన బాలురను అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో లేదా సంబంధిత ఆవాసంలోని పాఠశాలల్లో, బాలికలను కేజీబీవీల్లో చేర్పించనున్నారు. 15 నుంచి 19 సంవత్సరాల్లోపు విద్యార్థులు ఉంటే ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్ చదివేందుకు ప్రోత్సహించనున్నారు.



వేలేరులో బడిబయట విద్యార్థుల సర్వే చేస్తున్న సీఆర్పీ శ్రీనివాస్



మంక్తా నాయక్ తండాలో సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీ శాంతమ్మ

కలెక్టర్ సమీక్ష

2025–26 విద్యాసంవత్సరానికి ప్రత్యేకంగా నిర్వహిస్తున్న బడిబయట విద్యార్థుల గుర్తింపు సర్వేపై కలెక్టర్, విద్యాశాఖతోపాటు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, సర్వేకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే ఈ సర్వే డిసెంబర్‌లో జరగాల్సిండగా సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెతో నిలిచిపోయి, జనవరి 10నుంచి ప్రారంభమై కొనసాగుతోంది. సీఆర్పీలు ఆవాసము, లేదా గ్రామం, పట్టణ ప్రాంతాల్లో అక్కడ పనిచేసే విశ్రాంత ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రజాప్రతినిధులు, ఎన్జీఓల సహకారం తీసుకుంటున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పాఠశాలలకు పంపి విద్య ప్రాధాన్యతను తెలియజేయాల్సిన అవసరం ఉంది. సర్వేను జిల్లా విద్యాశాఖాధికారి డి.వాసంతి, మండల విద్యాశాఖాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ప్రబంధ పోర్టల్‌లో నమోదుచేయాలి



జిల్లాలో బడిబయట విద్యార్థులతో పాటు ప్రత్యేక అవసరాల పిల్లల ఉంటే గుర్తించి వారి వివరాలను సీఆర్పీలు ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేయాలి. బడిబయట పిల్లల సర్వేను 25వరకు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశాలిచ్చాం. ఆయా పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటాం.

– వాసంతి, డీఈఓ, హనుమకొండ

వలసదారులకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు



బడిబయట విద్యార్థుల్లో వలసదారుల (ఇమిగ్రేంట్స్) చిన్నారులు ఉంటే అలాంటి వారికి స్పెషల్ ట్రెనింగ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తాం. వారి వయస్సుకు తగిన తరగతిలో సంబంధించిన అభ్యసన సామర్థ్యాలు అందజేస్తాం. ఆ తర్వాత పాఠశాలల్లో చేర్పిస్తాం.

– ఎ.శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్

విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

ఐనవోలు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ కె.సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ, రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. బోధన విధానం, టీఎల్ఎం తయారీ, వినియోగం అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు మహేందర్ రెడ్డి, బీమళ్ల సారయ్య, లక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నోళ్లకే సంక్షేమ పథకాలా?

- గ్రామసభల్లో అధికారులను ప్రశ్నించిన ప్రజలు
- నాలుగు పథకాలకు 1,072 దరఖాస్తుల స్వీకరణ

కమలాపూర్: ఉన్నోళ్లకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇస్తారా? లేనోళ్లకు ఇవ్వరా అంటూ ప్రజలు గ్రామసభల్లో అధికారులను ప్రశ్నించారు. మండలంలోని పంగిడిపల్లి, అంబాల, ఉప్పల్, మర్రిపల్లి, లక్ష్మీపూర్, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లో రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు అర్హుల జాబితాలను చదివి వినిపించారు. ఉన్నోళ్లు, అనర్హుల పేర్లే జాబితాల్లో ఉన్నాయని, తమ పేర్లు జాబితాలో ఎందుకు లేవని అధికారులను ప్రశ్నించారు. ఈ జాబితాలో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామని అధికారులు చెప్పడంతో ప్రజలు మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా 6 గ్రామాల్లో నాలుగు పథకాలకు సంబంధించి 1,072 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ గుండె బాబు తెలిపారు. గ్రామసభల్లో ఏఎంసీ వైస్ చైర్మన్ దేశిని అయిలయ్యగౌడ్, మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శోభారాణి, ఎంపీఓ రవి, ఏఈఈ ఈఆర్ మధు, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



కమలాపూర్ : అంబాలలో దరఖాస్తు చేసుకుంటున్న గ్రామస్తులు

క్లుప్తంగా

25న జాతీయ ఓటర్ల దినోత్సవం

● అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్: ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జాతీయ ఓటర్ల దినోత్సవంతో పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవం సంబంధించిన వివిధ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పాఠశాలలు, కాలేజీల్లో ఓటరు ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలన్నారు. ఓటు ప్రాముఖ్యతను పెంచేలా ఫ్లాష్‌మాబ్, మానవహారంతో పాటు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్‌కు కేయూ మహిళా జట్టు



కేయూ క్యాంపస్ : మైసూర్ యూనివర్సిటీలో ఈనెల 23నుంచి 28వ తేదీ వరకు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేశామని స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య బుధవారం తెలిపారు.ఈజట్టులో ఎం నవ్య (కెప్టెన్), జి మోహనశ్రీ, జె. అనూష ,బి. నవ్య, బి.లీషా, టి. అశ్విత, వి. సుజాత వై.రచిత, ఎం. దాత్రిశ్రీ, పి. సరిత, ఎస్. జయశ్రీ, ఎస్. తుష్మరేఖ, డి. యశస్విని, ఎం. సౌమ్యశ్రీ, పి. శ్రీనిధి, బి. మంజుల ఉన్నారని వెంకయ్య తెలిపారు. ఈ జట్టుకు హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎండి. అఫ్జల్ కోచ్ కమ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారని వెంకయ్య తెలిపారు.


గొలుసుకట్టు స్కీం పేరుతో వసూళ్లు

● వరంగల్ వాసి సహా ముగ్గురిపై కేసు నమోదు

రఘునాథపాలెం: ఒకసారి రూ.2,500 చెల్లించి మరికొందరిని చేర్పిస్తే ఎనిమిది నెలల పాటు రూ.వెయ్యి చొప్పున సరుకులు అందించడమే కాక ప్రతీనెల రూ.వేయి ఇస్తామని నమ్మబలికి గొలుసుకట్టు స్కీం పేరుతో వసూళ్లకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదైంది. ఈ సందర్భంగా బుధవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ వివరాలు వెల్లడించారు. రఘునాథపాలెం మండలంలోని చిమ్మపుడి, కోయచలక తదితర గ్రామాల్లో 39 మంది నుంచి రూ.2,500 చొప్పున వసూళ్లకు పాల్పడినట్లు ఫిర్యాదు అందడంతో వరంగల్‌కు చెందిన లక్ష్మయ్యతో పాటు చిమ్మపుడి, ఖానాపురానికి చెందిన ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేశారు. కాగా, గొలుసుకట్టు సంస్థ ప్రధాన కార్యాలయం వనపర్తిలో, ప్రాంతీయ కార్యాలయం వరంగల్‌లో ఉండగా ఖమ్మంలోనూ కార్యాలయం తెరిచారా, ఇందులో ఇంకా ఎవరెవరి పాత్ర ఉందనే అంశంపై విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కమల దళపతి ఎవరో..?

● హనుమకొండ జిల్లా అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ
● ప్రస్తుత అధ్యక్షురాలు రావు పద్మ పదవీ కాలం పూర్తి
● రాష్ట్ర కమిటీకి ఐదుగురితో జాబితా.. జాతీయ కమిటీకి వెళ్లనున్న ముగ్గురి జాబితా
● గాడ్ ఫాదర్‌ల ద్వారా ఎవరికివారు ముమ్మర ప్రయత్నాలు



హన్మకొండ: బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ నెలకొంది. సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా సభ్యత్వ నమోదు పూర్తి కావడంతో పాటు ఇప్పటికే వరంగల్ మహానగరంలోని డివిజన్‌లు, జిల్లాలోని మండల అధ్యక్షుల ఎన్నిక ముగిసింది. హనుమకొండ జిల్లా అధ్యక్ష పదవిని భర్తీ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో ఆశావహులు ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ సారి బీజేపీ అధిష్టానం అత్యంత పకడ్బందీగా, ఆచీతూచి కమిటీల కూర్పు చేస్తోంది. గతంలో మండల పార్టీ అధ్యక్షులు, నగరంలోని వార్డు, డివిజన్‌ల అధ్యక్షులను జిల్లా కమిటీ ప్రకటించేది. ఈసారి రాష్ట్ర అధిష్టానమే ప్రకటించింది. అదే విధంగా జిల్లా అధ్యక్ష పదవులను గతంలో రాష్ట్ర అధిష్టానం ప్రకటించగా ఈ సారి జాతీయ పార్టీ నిర్ణయం తీసుకోనుంది. ప్రస్తుత హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పదవీకాలం పూర్తికానుంది. బీజేపీలో ఒకరు రెండు పర్యాయాలు మాత్రమే అధ్యక్షులుగా కొనసాగుతారు. కానీ రావు పద్మ 2016లో వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షురాలిగా మొదటి సారి, 2021లో రెండో సారి, 2024లో మూడోసారి అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమెకు అవకాశం లేకపోవడంతో పార్టీలో సీనియర్‌లతో పాటు జూనియర్‌లు అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్నారు.

అనుభవం, పార్టీ కార్యక్రమాలను వివరిస్తూ..

జిల్లా అధ్యక్షపదవిని ఆశిస్తున్న ఐదుగురు గతంలో వారు కొనసాగిన పదవులు, అనుభవం, పార్టీ కోసం చేపట్టిన కార్యక్రమాలు వివరిస్తూ అధ్యక్ష పదవి దక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికి వారు గాడ్ ఫాదర్‌ల ద్వారా ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో కొందరు సామాజిక సమీకరణాల్లోను అవకాశం దక్కేలా యత్నిస్తున్నారు. గతంలో ఆశించి పార్టీ నాయకత్వం సూచనల మేరకు పోటీనుంచి తప్పుకున్న వారు ఈసారైన తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. మిగతావారు తాము పూర్తిగా సమయం కేటాయించి పార్టీ కోసం పని చేశామని, అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని..

రానున్నది స్థానిక సంస్థల ఎన్నికల కాలంకావడంతో అధిష్టానం ఈసారి ఆచీతూచి నిర్ణయం తీసుకోనుంది. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. ఇందులో ప్రధానంగా వరంగల్ మహానగర పాలక సంస్థ ఎన్నికలు త్వరలో రానున్నాయి. ఈ సారి ఎలాగైన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మెజారిటీ సీట్లు సాధించాలనే లక్ష్యంతో పార్టీ నాయకత్వం ముందుకు పోతోంది. దీంతోపాటు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోను పట్టు సాధించాలనే ధృడసంకల్పంతో ఉంది. ఈ క్రమంలో ఎవరికి బాధ్యతలు అప్పగిస్తే తామనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతామనే ఆలోచించి నిర్ణయం తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, వారంలోపు నిర్ణయం వెలువడే అవకాశముందని భావిస్తున్నారు.

చాలామంది ఆశావహులు..

రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాడా శ్రీనివాస్ రెడ్డి, రావుల కిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొలను సంతోష్ రెడ్డి, దేశిని సదానందం, ఆర్.పి.జయంత్‌లాల్, పరకాల నియోజకవర్గానికి చెందిన దామెర తాజా మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, కార్పొరేటర్ గుజ్జుల వసంత, బీజేపీ వరంగల్ పశ్చిమ కన్వీనర్ కందగట్ల సత్యనారాయణతో పాటు మరికొందరు పార్టీ అధ్యక్ష పదవిని ఆశిస్తూ వచ్చారు. రాష్ట్ర పార్టీ నుంచి వచ్చిన జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి పెద్దోళ్ల గంగారెడ్డి, రాష్ట్ర పరిశీలకుడు తల్లోజు ఆచారి జిల్లా అధ్యక్షుల ఎంపికపై పరిశీలన చేశారు. అందరినుంచి అభిప్రాయాలు సేకరించారు. ఆశావహులనుంచి ఐదుగురు పేర్లు ఎంపిక చేశారు. ఇందులో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాడా శ్రీనివాస్ రెడ్డి, రావుల కిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొలను సంతోష్‌రెడ్డి, దేశిని సదానందం, మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరాం రెడ్డి పేర్లను రాష్ట్ర కమిటీకి పంపారు. ఈ జాబితాను రాష్ట్ర నాయకత్వం వడపోసి ముగ్గురి పేర్లు జాతీయ నాయకత్వానికి పంపుతుంది. ఆ ముగ్గురిలోనుంచి ఒక్కరిని జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేయనున్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

● త్రిదండి చినజీయర్ స్వామి


మాట్లాడుతున్న చినజీయర్ స్వామి

ఖిలా వరంగల్: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి అన్నారు. బుధవారం వరంగల్ ఉర్సు గుట్ట నానిగార్డెన్‌లో వడుప్సా(ట్రస్మా) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ జనరల్ సెక్రటరీ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు, ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్, జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్ అధ్యక్షతన పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థులకు ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా త్రిదండి చినజీయర్ స్వామి హాజరైజ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఆధ్యాత్మిక భావం అలవర్చుకోవాలన్నారు. మానసిక ఒత్తిడికి లోనుకాకుండా విషయ పరిజ్ఞానం తెలుసుకోవాలన్నారు. క్రమశిక్షణ పట్టుదలతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని తెలిపారు. ప్రతి విద్యార్థి సన్మార్గంలో పయనిస్తూ తల్లిదండ్రులు, గురువులను దైవంగా భావించాలన్నారు. అనంతరం ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి మాట్లాడారు. విద్యార్థులు పరీక్ష సమయం వృథా చేయొద్దన్నారు. శ్రద్ధతో చదివి 10/10 గ్రేడ్ సాధించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర ప్రతినిధులు కోడెం శ్రీధర్, అంకతి వీరస్వామి, బిల్లా రవి, జ్ఞానేశ్వర్‌సింగ్, సతీశ్, చక్రపాణి, మడిపెల్లి రాజు, కూచన క్రాంతికుమార్, దాసి సతీశ్‌మూర్తి, కిరణ్, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్..

● చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్
● వివరాలు వెల్లడించిన సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి

వరంగల్ క్రైం: తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్ట్ చేసి నిందితుడి నుంచి సుమారు రూ. 50 వేల విలువైన ఐదు గ్రాముల బంగారు, 61 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం కరక్కాయల గూడెం గ్రామానికి చెందిన సన్నిధి ఆంజనేయులు రోజువారీ కూలి పనిచేస్తూ వచ్చే ఆదాయంతో జల్సాలు చేసేవాడు. అయితే జల్సాలకు ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో సుబేదారి పీఎస్ పరిధిలోని చిల్డ్రన్స్ పార్క్ ప్రాంతంలో ఇటీవల తాళం వేసి ఉన్న ఇంటిలో ఐదు గ్రాముల బంగారు, 61 గ్రాముల వెండి ఆభరణాలు, రూ. 60 వేల నగదు అపహరించాడు. నిందితుడు గతంలోనూ పలుమార్లు చోరీలకు పాల్పడడంతో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ క్రమంలో బుధవారం మరోసారి చోరీకి పాల్పడేందుకు హంటర్ రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులకు అనుమానం వచ్చింది. అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

చైన్‌స్నాచర్ అరెస్ట్..

చైన్‌స్నాచర్‌ను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.3.60 లక్షల విలువైన 45 గ్రాముల బంగారు గొలుసుతో పాటు ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండల కేంద్రానికి చెందిన ములక విజయ్‌కుమార్ మంగళవారం మధ్యాహ్నం కొత్తూరు జెండా ప్రాంతంలో ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలు హనుమకొండ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో అప్రమత్తమైన హనుమకొండ, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా.. టెక్నాలజీ సాయంతో నిందితుడి ఆచూకీ కనిపెట్టి అరెస్ట్ చేసి చోరీ చేసిన బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితుడు ఖమ్మం, జనగామ, వరంగల్, కాజీపేట, పర్వతగిరి, సుబేదారి పోలీస్ స్టేషన్ల పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్స్ ప్రారంభం

● తొలిసెషన్‌లో 1,220 మంది, రెండో సెషన్‌లో 1,225 మంది హాజరు

విద్యారణ్యపురి: జాతీయ విద్యా సంస్థలు ఐఐటీ, నిట్‌లలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు జరగుతున్నాయి. హనుమకొండ, వరంగల్‌లో కలిపి 5 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. హనుమకొండలోని జయ ఇంజనీరింగ్ కళాశాల, హసన్‌పర్తిలోని అయాన్ డిజిటల్ జోన్, భీమారంలోని మోక్షిత కంప్యూటర్స్, భీమారంలోని చింతగట్టు టెక్నాలజీ సొల్యూషన్స్, వరంగల్‌లోని బొల్లికుంట ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్రాలుగా ఉండగా పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈనెల 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో పరీక్షలు జరగుతాయి. మొత్తం 7,542 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. తొలిరోజు బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగిన సెషన్‌లో మొత్తం 1,252మంది అభ్యర్థులకు 1,220మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్ పరీక్షలు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించారు. మొత్తం 1,259మంది అభ్యర్థులకు గాను 1,225మంది హాజరుకాగా 34 మంది గైర్హాజరయ్యారని జేఈఈ మెయిన్స్ సిటీ కోఆర్డినేటర్ కె. శ్రీలతారెడ్డి తెలిపారు. పరీక్షలకు నిర్దేశించిన సమయం కంటే రెండు గంటల ముందు నుంచే కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించారు. ఉదయం సెషన్‌లో 8.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు కేంద్రాల గేట్లు మూసివేశారు. అభ్యర్థులు హాల్ టికెట్ అడ్మిట్‌కార్డుతోపాటు ఎన్‌టీఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన సెల్ఫ్‌డిక్లరేషన్, పాస్‌ఫొటో, ఒరిజనల్ గుర్తింపు కార్డులు పరిశీలించిన అనంతరమే అనుమతించారు.

లక్ష మందితో బీసీ యుద్ధభేరి సభ

● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 2న నిర్వహించనున్న బీసీ యుద్ధభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం కేయూ దూరవిద్య కేంద్రంలోని జాఫర్ నిజాం సెమినార్‌హాల్‌లో బీసీ విద్యార్థి సంఘాలు, విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం జరుగుతోందని, అందుకే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. లక్షమందితో జరగబోయే బీసీ యుద్ధభేరి బహిరంగసభకు బీసీలు ఐక్యంగా తరలివచ్చి సత్తాచాటాలని పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలోని బీసీ విద్యార్థులంతా తరలిరావాలన్నారు. సమావేశంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ మేడారపు సుధాకర్, నరేశ్, బీసీ విద్యార్థి సంఘం బాధ్యులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత దూరవిద్య కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలువేశారు. అంతకుముందు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో సభాస్థలిని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతోపాటు వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి, బీసీ నేత సుందర్ రాజు యాదవ్, బీసీ నేతలు, కుల సంఘాల బాధ్యులు పరిశీలించారు.

మిలిటరీ వ్యూహాల్లో టెక్నాలజీ కీలకం

● కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: మిలటరీ వ్యూహాల్లో కంప్యూటర్ టెక్నాలజీ కీలక భూమిక వహిస్తుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. బుధవారం యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆవిభాగం సెమినార్‌హాల్‌లో నిర్వహించిన 'టూ వీక్స్ ఇంటెన్సివ్ ప్రోగ్రాం ఫ్రమ్ ఎక్సెల్ టూ పవర్ బీ ఫర్ ఎన్‌సీసీ జవాన్స్' ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలద్వారా ఇంజనీరింగ్, కంప్యూటర్ నైపుణ్యాలు మెరుగుపడుతాయన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి రమ మాట్లాడుతూ.. రెండు వారాల పాటు రోజూ ఉదయం రెండు గంటలు థియరీ, సాయంత్రం రెండు గంటలు ప్రాక్టికల్స్ కృత్రిమ మేధా, ఎక్సెల్ పవర్ బీ ఐ డేటా అనాలిసిస్‌లపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సింథల్ రామదురై మాట్లాడుతూ.. రెండు వారాల శిక్షణద్వారా సామర్థ్యాల పెంపు, వాల్యూ అడిషన్ జరగుతుందన్నారు. యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేశ్‌లాల్, బీఓఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ మంజుల, డాక్టర్ రమేశ్, డాక్టర్ నీలిమ, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ రవి, సునేహార్ విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


నిరసన తెలుపుతున్న 104 ఉద్యోగులు

ఎంజీఎం : వరంగల్ జిల్లా వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న 104 కాంట్రాక్ట్ ఉద్యోగులకు గత ఆరు నెలలుగా వేతనాల అందక అవస్థలు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే వారి పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయూఎంహెచ్‌ఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు 104 ఉద్యోగులతో కలిసి బుధవారం నల్ల రిబ్బన్ ధరించి డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యాదనాయక్ మాట్లాడుతూ.. 104 ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 33 జిల్లాలకు ఆరు నెలలకు సంబంధించిన బడ్జెట్ విడుదల చేసిందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఉద్యోగులకు చెల్లింపు పూర్తయినా.. ఒక్క వరంగల్ జిల్లాలోనే వేతనాలు విడుదల చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు మూడు రోజుల్లో విడుదల చేయాలని లేకపోతే ఈనెల 27న వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో 104 ఉద్యోగులు పర్లపల్లి శ్రీనివాస్, రాజ్‌కుమార్, సృజన, మధు, క్రాంతికుమార్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

● పెద్ది వెంకటనారాయణ


క్రీడాకారులతో పెద్ది వెంకటనారాయణ, తదితరులు

కాజీపేట రూరల్: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమని, నేటి ఆధునిక జీవన విధానంలో తగ్గిపోతున్న క్రీడల ప్రాధాన్యత పెంపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్, జనగామ జిల్లా అథ్లెటిక్స్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ అన్నారు. కాజీపేట రైల్వే స్టేడియంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో లోకో 11 జట్టు- ఇంజనీరింగ్ జట్టు మధ్య క్రికెట్ పోటీని బుధవారం పెద్ది వెంకటనారాయణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులకు క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి రైల్వే ఉద్యోగులకు కావాల్సిన సహకారం అందిస్తామని తెలిపారు. రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ ఆర్డీఎం జట్టు-రైల్వే ఇన్‌స్టిట్యూట్ జట్ల మధ్య పోటీని ప్రారంభించి మాట్లాడారు. క్రీడలను మానసికోల్లాసమే కాకుండా బాల్యస్మృతులను గుర్తు చేస్తాయన్నారు. క్రీడలతో ఆరోగ్య సమస్యలకు చెక్‌పెట్టొచ్చని అభిప్రాయపడ్డారు. మొదటి మ్యాచ్‌లో రైల్వే ఇన్‌స్టిట్యూట్ జట్టుపై ఆర్డీఎం జట్టుజట్టు గెలిచింది. రెండో మ్యాచ్‌లో లోకో -11 జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, కోశాధికారి గిరిమిట్ల రాజేశ్వర్, కల్చరల్ విభాగాల ఇన్‌చార్జ్ దారవత్ రఘు, క్రికెట్ క్రీడల విభాగాల ఇన్‌చార్జ్ పి.ప్రశాంత్, కమిటీ సభ్యులు ఎస్.ప్రవీణ్, పి.రవికిరణ్, సుంచు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

మాషుక్ రబ్బానీ ఉర్సు ప్రారంభం..

● భక్తిశ్రద్ధలతో గంధం, చాదర్ ఊరేగింపు
● పాల్గొన్న మంత్రి కొండా సురేఖ



పీఠాధిపతికి చాదర్‌ను అందజేస్తున్న మంత్రి సురేఖ

న్యూశాయంపేట : వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని హజ్రత్ సయ్యద్‌షా జలాలుద్దీన్ జామలుల్ బహర్ మాషుఖ్ ఏ రబ్బానీ(ర.అ) 469వ ఉర్సు ఉత్సవాలు బుధవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. దర్గా పీఠాధిపతులు నవీద్‌బాబా, ఉబేద్‌బాబా ఇంటి నుంచి అర్ధరాత్రి గంధం, చాదర్‌ను భక్తిశ్రద్ధలతో వేలాది మంది భక్తుల సమక్షంలో తెల్ల వారుజాము వరకు ఊరేగించి మాషూఖ్‌రబ్బానీ దర్గా వరకు తీసుకెళ్లి సమర్పించారు. మూడు రోజులు జరిగే ఉత్సవాల్లో మొదటి రోజు బుధవారం గంధం ఊరేగింపు, రెండో రోజు ఉర్సు, మూడో రోజు బాదావ ఉంటుంది. అంతకు ముందు రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ అశ్వినీతానాజీ వాఖడే దర్గా పీఠాధిపతుల ఇంటికి చేరుకున్నారు. అనంతరం మాషూఖ్‌రబ్బానీ దర్గాను సందర్శించి మాషుఖ్‌రబ్బానీ(ర.అ) సమాధిపై గిలాఫ్, పూలు, సమర్పించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కాగా, మంత్రి సురేఖ.. భక్తులతో ముచ్చటించారు. ఏర్పాట్లపై ఆరాతీశారు.

విద్యుత్‌దీపాలతో ధగధగ మెరిసిన దర్గా..

ఉర్సు ఉత్సవాల్లో భాగంగా మాషుఖ్ దర్గా ప్రాంగణం విద్యుత్ దీపాలతో ధగధగ మెరిసింది. వేలాది మంది భక్తులతో దర్గా ప్రాంగణం కిటకిటలాడింది. ఉత్సవాల్లో భాగంగా దర్గా, కరీమాబాద్ పరిసర ప్రాంతాల్లో హోటళ్లు, కంగన్‌హాళ్లు, పిల్లల ఆటవస్తువుల స్టాళ్లు వెలిశాయి. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. కార్పొరేటర్లు రవి, మహ్మద్ ఫుర్ఖాన్, పల్లం పద్మరవి, నాయకులు నవీన్‌రాజ్, అయాబ్, ఎం.ఏ.జబ్బార్, ఎం.డి.వసీం, చాంద్‌పాషా, అమ్జద్, తదితర నాయకులు పాల్గొన్నారు.


దర్గాప్రాంగణంలో విడిదిచేసిన భక్తులు


విద్యుత్ కాంతులతో ధగధగ మెరుస్తున్న దర్గా ప్రాంగణం

రూ.24.45 కోట్లతో కాజీపేట జంక్షన్ అభివృద్ధి

● అమృత్ భారత్ పథకంలో భాగంగా శరవేగంగా సాగుతున్న పనులు
● వివరాలు వెల్లడించిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు


పనుల తర్వాత ఉండే కాజీపేట జంక్షన్ నమూనా

కాజీపేట రూరల్: 19వ శతాబ్దం నిజాం కాలంలో నిర్మించిన కాజీపేట జంక్షన్‌ను రైల్వేశాఖ అమృత్ భారత్ స్టేషన్ పథకానికి ఎంపిక చేసి రూ.24.45 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తోంది. ఈ మేరకు బుధవారం కాజీపేట జంక్షన్ రీడెవలప్‌మెంట్ పనుల వివరాలను రైల్వే అధికారులు విలేకరులకు వెల్లడించి మాట్లాడారు. భారతీయ రైల్వేలో ప్రయాణికులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు అందించాలనే దృక్పథంతో భారీ స్థాయిలో రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కాజీపేట జంక్షన్‌లో చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. తెలంగాణలో 2023 ఆగస్టు, 2024 ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ.. రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. భారత రైల్వే మంత్రిత్వ శాఖ రైల్వే స్టేషన్లను ఆధునీకరించడం, దీర్ఘకాలిక దృష్టితో నిరంతర ప్రాతిపదికన అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అమృత్‌భారత్ స్టేషన్ స్కీమ్‌ను రూపొందించినట్లు తెలిపారు. కాజీపేట రైల్వే స్టేషన్ రూ.41.36 కోట్ల వార్షిక ఆదాయంతో సగటున రోజుకు 24,269 మంది ప్రయాణికులకు సేవలందిస్తోందని, ఇక్కడ దాదాపు 98 రైళ్లకు హాల్టింగ్ ఉందన్నారు. అన్ని సౌకర్యాలతో ఇప్పటి వరకు 40 శాతం పనులు పూర్తయ్యాయని, ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయాలని లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు.